
సాక్షి ఒడిశా

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,80,915లు, బంగారం 50 మిల్లీగ్రాములు వెండి 33 గ్రాముల 750 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నెత్తురోడిన రహదారులు

రాష్ట్రంలోని రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు.

- 8లో



ప్రభుత్వాస్పత్రి సందర్శన

రాయగడ ప్రభుత్వ ఆస్పత్రిని రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కడ్రక సోమవారం సందర్శించారు.

- 8లో

న్యూస్‌రీల్

మల్కన్‌గిరికి రెడ్ అలెర్ట్



నీట మునిగిన పొట్టేర్ పోలీసుస్టేషన్

మల్కన్‌గిరి: జిల్లాలో మంగళవారం భారీ వర్షాలు కురవనున్నట్లు కలెక్టర్ ఈశ్వర్ పటేల్ రెడ్ అలెర్ట్ జారీ చేశారు. అందువలన పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. ఇళ్లు, పంట పొలాలు నష్టపోయినవారికి ప్రభుత్వం నుంచి పరిహారం అందిస్తామని తెలిపారు. ఉద్యోగులు సెలవులు పెట్టకూడదని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావస కేంద్రాలకు తరలిస్తున్నామని వెల్లడించారు.

మహానదికి వరద అవకాశం

భువనేశ్వర్: రానున్న 24 గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, మహానదిలో చిన్నపాటి వరద పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ చంద్రశేఖర్ పాడి సోమవారం తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావంతో మహానది నదిలో చిన్నపాటి వరద వచ్చే అవకాశం ఉంటుందన్నారు. హిరాకుద్ జలాశయం నీటి మట్టం గరిష్ట పరిమితి 630 అడుగులకు గాను, ప్రస్తుతం 623.93 అడుగులకు చేరుకుంది. జలాశయంలోనికి సెకనుకు సగటున 50,00 క్యూసెక్కుల నీరు చేరుతోందని ఆయన తెలిపారు. ఆదివారం ముండలిలో సగటున 30 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రాబోయే 24 గంటల్లో హిరాకుద్ జలాశయం దిగువన 76 నుంచి 100 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. వరద వస్తే ముండలి వద్ద 5 లక్షల క్యూసెక్కుల కంటే తక్కువ నీటిని విడుదల చేయడంతో పెద్దగా ఇబ్బంది లేకుండా పోతుందని అభిప్రాయపడ్డారు. అయితే ఇప్పటికే జలవనరుల శాఖ అధికారులందరినీ అప్రమత్తం చేశామని, 24 గంటల కంట్రోల్ రూమ్‌ను కూడా ప్రారంభించామని తెలిపారు. మహానది వ్యవస్థలో వరద భయం లేనట్లు రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనరు దేవరంజన్ కుమార్ సింగ్ తెలిపారు. మహానది వ్యవస్థలో ఎక్కువ నీరు లేదు. కాబట్టి ప్రస్తుతానికి వరద ముప్పు లేదు, అయినప్పటికీ పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు వివరించారు. అయితే భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలకు వరదలు వచ్చే అవకాశం ఉందన్నారు. వివిధ కాలువల ద్వారా 39 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. హిరాకుద్ జలాశయం గేట్లను తెరవలేదు. మహానది ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు లేనందున, గేట్లు తెరిచే అవకాశం తక్కువగా ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

పట్టణ ప్రాంతాల్లో అప్రమత్తత అవసరం



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఉషా పాఢి

భువనేశ్వర్: భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సూచన మేరకు పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో అల్ప పీడనం బలపడింది. ఈ వ్యవస్థ ప్రభావంతో రాబోయే 48 గంటల్లో ఉత్తర ఒడిశా మరియు పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మల్కన్‌గిరి, కొరాపుట్, రాయగడ, గజపతి, గంజాం జిల్లాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. ఈ పరిస్థితుల దృష్ట్యా, గృహ నిర్మాణం, నగర అభివృద్ధి విభాగం ప్రముఖ కార్యదర్శి ఉషా పాఢి మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ కార్య నిర్వాహక అధికారులు హైఅలర్ట్‌గా ఉండాలని అప్రమత్తం చేశారు. ఎటువంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అన్ని పట్టణ స్థానిక సంస్థలు (యూఎల్‌బీ) తక్షణమే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, పంపు సెట్ల లభ్యతను నిర్ధారించాలని, రహదారి కోతలు, ఇతర అంతరాయాలపై అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం జరిగిన వర్చువల్ సమీక్షా సమావేశంలో ఉషా పాఢి ప్రస్తుత పరిస్థితిని విభాగం సీనియర్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులు, కమిషనర్లు మరియు కార్య నిర్వాహక అధికారులతో చర్చించారు. నిరంతర పర్యవేక్షణ అవసరమని, అన్ని పట్టణ ప్రాంతాల్లో పాలక సంస్థలు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని ఆమె ఉద్ఘాటించారు. నగర అభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ ప్రభాకర్ పాటిల్, మున్సిపల్ డైరెక్టర్ దేబాశిష్ సింగ్, గృహ నిర్మాణ శాఖ డైరెక్టర్ గంగాధర్ నాయక్ మరియు అదనపు కార్యదర్శి రవీంద్ర కుమార్ సాహుతో సహా శాఖ సీనియర్ అధికారులు కూడా అవసరమైన అన్ని జాగ్రత్తలతో అనుబంధ యంత్రాంగం సన్నద్ధంగా ఉందని తెలిపారు.



పర్లాకిమిడి: పాతపట్నం-పర్లాకిమిడి వద్ద మహేంద్రతనయ ఉధృతి



పర్లాకిమిడి: గుమ్మా సమితి తరంగడలో కూలిన ఇంటి గోడ



మల్కన్‌గిరి: మోటు వద్ద వరదలో ప్రజలు



కులు నది వంతెనపై పారుతున్న వర్షపు నీరు



మల్కన్‌గిరి: వరదల్లో మల్కన్‌గిరి

చిగురుటాకులా...!

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల కుండపోత వర్షం కురవడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. జలశయాలు నిండికుండలా మారి పొంగిపొర్లుతున్నాయి. రహదారులు కొట్టుకుపోవడంతో ఎక్కడికక్కడే రవాణా వ్యవస్థ స్తంభించిపోయి, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాలకు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

– సాక్షి నెట్‌వర్క్

- రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- పొంగిపొర్లుతున్న జలశయాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- కొట్టుకుపోయిన రహదారులు

జయపురంలో విస్తారంగా...

జయపురం: సబ్ డివిజన్ పరిధిలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బొరిగుమ్మ, కుంద్రా సమితిల్లోనూ బిజాపూర్, బండి, గుడ, జానిగుడ, సామరత్‌గుడ, డెంగాగుడ గ్రామాల్లో భారీ వర్షాలు కారణంగా పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర వరద గ్రామాలను సందర్శించి ప్రజల కష్టాలను తెలుసుకున్నారు.

విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోకి వరద నీరు

కొరాపుట్: ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల సంయుక్త నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోకి వరద నీరు సోమవారం చేరింది. కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి వనక ఢిల్లి గ్రామ సమీపంలో ఈ ప్రాజెక్ట్ ఉంది. వరద నీటి ప్రభావంతో జోలాపుట్ డ్యామ్ నుంచి 6 గేట్లు ఎత్తి వేయడంతో 23 వేల క్యుసెక్కుల నీరు బయటకు వెళ్తోంది. అలాగే మాచ్‌ఖండ్ పరిధిలోని డీ డ్యామ్ నుంచి 4 గేట్లు ఎత్తి వేయడంతో 20 వేల క్యుసెక్కుల నీరు విడుదల అవుతోంది. దీనివలన 2వ యునిట్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోకి వరద నీరు వచ్చింది. దీంతో యునిట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారు. మోటార్లతో నీటిని బయటకు తోడుతున్నారు. వరద నీరు లోపలి రాకుండా ఇసుక బస్తాలు అడ్డుగా వేసారు. మరోవైపు కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తుండడంతో, ఇంద్రావతి, టురి, బస్కల్, శబరి, గంతాయిత్, కొలాబ్ నదులు పొంగి పొర్లుతున్నాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




కలెక్టర్ పట్వారి

రాయగడ: రానున్న 24 గంటల్లో జిల్లాలో భారీ నుంచి అతిభారీగా వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఫరూల్ పట్వారి హెచ్చరించారు. కేవలం అత్యవసరం అయితేనే బయటకు వెళ్లాలని సూచించారు. జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా సమీపంలోని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని కోరారు.

మల్కన్‌గిరిలో వరద బీభత్సం

మల్కన్‌గిరి: జిల్లాలో వరద బీభత్సం సృష్టిస్తోంది. కలిమెల సమితి పొట్టేర్ వద్ద వంతెన విరిగిపోవడంతో గ్రామాన్ని వరద నీరు ముంచెత్తింది. దీంతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం ఓడ్రాఫ్ బృందాన్ని రంగంలోకి దింపి సహాయక చర్యలు ప్రారంభించింది. అలాగే మలకన్‌గిరి ప్రధాన రహదారిపై రెండు అడుగులు మేర వరద నీరు ప్రవహిస్తోంది. ఖోయిర్‌పూట్ సమితి బోండఘట్టిపై కొండ చరియలు విరిగిపడి ఖోయిర్‌పూట్ ముదిలిపోడకు రాకపోకలు నిలిచిపోయాయి. చిత్రకొండ రహదారిలో చెట్లుపడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మత్తిలి సమితి పంగం నది వంతెనపై నాలుగు అడుగుల వరద నీరు ప్రవహించడంతో మల్కన్‌గిరి -జయపురం రహదారి మూసివేశారు.

గజపతిలో పొంగిపొర్లుతున్న నదులు



పర్లాకిమిడి: రాణిపేట వద్ద గుమ్మగెడ్డ

పర్లాకిమిడి: వాయుగుండం ప్రభావంతో గజపతి జిల్లాలో కురుస్తున్న వర్షాలకు మహేంద్రతనయ, వంశధార నదులు పొంగిపొర్లుతున్నాయి. కోయిపూర్‌లో వర్షాలు అధికంగా పడడంతో గండాహతి, ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో మహేంద్రతనయ నది రెండు గేట్లను తాకుతోంది. గుమ్మా సమితి తరంగడ పంచాయతీ కుమ్మిసింగి గ్రామంలో ఇల్లు వర్షాలకు కూలిపోయింది.

ఉన్నతాధికారుల సమీక్ష




సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మల్కన్‌గిరి, కొరాపుట్ ప్రాంతాల్లో వరద పరిస్థితిని ఎదుర్కొనేందుకు సన్నద్ధ చర్యలను ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా సమీక్షించారు. ఆయన అధ్యక్షతన సోమవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అభివృద్ధి కమిషనర్, అదనపు ప్రముఖ కార్యదర్శి, జలవనరులు, అదనపు డైరెక్టర్ జనరల్ (శాంతి భద్రతలు), ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ), ఒడిశా రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఓస్డమా), ఇతర శాఖల ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. మల్కన్‌గిరి జిల్లా వరద నియంత్రణ కార్యకలాపాలు పర్యవేక్షించేందుకు సాధారణ స్థితిని పునరుద్ధరించడంలో సహాయం అందజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం డైరెక్టర్ జనరల్ (అగ్నిమాపక సేవలు మరియు హోంగార్డ్స్) సుధాంశు షడంగి, ప్రిన్సిపల్ సెక్రటరీ విష్ణుపద సెఠి, డీఐజీ (దక్షిణ విభాగం) చరణ్ మీనాలను నియమించింది. మల్కన్‌గిరిలోని పంగం నుంచి మోటు రోడ్డు వరకు ఉన్న అన్ని వంతెనలపై వరద నీరు ప్రవహిస్తోంది. ఈ మార్గాల్లో 8 చోట్ల రహదారులపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మల్కన్‌గిరి, కలిమెల మండలాల్లో 6 గ్రామాలు ప్రభావితం అయ్యాయి. 504 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి నాలుగు సహాయక శిబిరాల్లో ఆశ్రయం కల్పించారు. రెండు యూనిట్లు ఓడ్రాఫ్ దళాలను జిల్లాలో మోహరించారు. అలాగే కొరాపుట్ జిల్లా జయపురం, బొయిపరిగూడ, కుంద్రా, బొరిగుమ్మ, సెమిలిగూడ, కొరాపుట్ మండలాల్లో 36 గ్రామాలు ప్రభావితమయ్యాయి. మొత్తం 56 మందిని వండిన ఆహారం అందజేసే రెండు సహాయ శిబిరాలకు తరలించారు.

తీరం దాటిన వాయుగుండం

భువనేశ్వర్: సోమవారం ఉదయం 10.30 - 11.30 గంటల సమయంలో ఒడిశాలోని పూరీకి చేరువలో వాయుగుండం తీరం దాటిందని స్థానిక భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శాస్త్రవేత్త ఉమాశంకర్ దాస్ తెలిపారు. అనంతరం 24 గంటల్లో ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ, వాయువ్య దిశగా పయనించే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈనెల 11 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.



మల్కన్‌గిరి: సత్తిగూడ జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు



కొరాపుట్: జోలాపుట్ డ్యామ్ నుంచి విడుదలవుతున్న నీరు



మల్కన్‌గిరి: బోండాఘాటీపై విరిగిపడిన కొండ చరియలు



మల్కన్‌గిరి: వరద ప్రవాహంతో కొట్టుకుపోయిన రహదారి



మల్కన్‌గిరి: పొట్టేరును ముంచెత్తిన వరద



కొరాపుట్: డీ డ్యామ్ నుంచి విడుదలవుతున్న నీరు



పర్లాకిమిడి: రాణిపేట వద్ద గుమ్మగెడ్డ



కొరాపుట్: మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో చేరిన నీరు



రాయగడ: రాణిపెండ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నీరు

క్లుప్తంగా

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లో ఉన్న ఎన్‌టీఆర్ నైపుణ్య, సాధికారిత మహిళా ప్రాంగణంతో ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం మేనేజర్ కె.పార్వతి సోమవారం ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి ఉత్తీర్ణత ఆధారంగా నిర్వహించే నెల వ్యవధి కోర్సు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, 8వ తరగతి ఉత్తీర్ణత ఆధారంగా నిర్వహించే నెల వ్యవధి కోర్సు టైలరింగ్, 8వ తరగతి ఆధారంగా నిర్వహించే 45 రోజుల శిక్షణ కోర్సు మగ్గం వర్కుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అర్హులైన మహిళలు ఈ నెల 15వ తేదీలోపు విద్యార్హత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలతో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 8333921337, 9948530183, 7416764419 ను సంప్రదించాలని సూచించారు.

పర్మిట్లు ఇచ్చి ఆదుకోండి



టెక్కలి మైన్స్ ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న ఉత్తరాంధ్ర గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు

టెక్కలి: గ్రానైట్ క్వారీల్లో బ్లాకుల తరలింపునకు పర్మిట్‌లు ఇచ్చి గ్రానైట్ యాజమాన్యం, కార్మికులను ఆదుకోవాలని ఉత్తరాంధ్ర గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం టెక్కలి మైన్స్ ఏడీ ఫణి భూషణ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రానైట్ నిర్వాహణ బాధ్యతలు విశ్వ సముద్ర సంస్థకు కేటాయించినప్పటికీ, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఎలాంటి పర్మిట్‌లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. తక్షణమే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పర్మిట్‌లు ఇచ్చే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఆశ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: స్థానిక సచివాలయం-3 పరిధిలో ఆశ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న సనపల సరస్వతి సోమవారం అధిక మోతాదులో మాత్రలు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సరస్వతి తాను విధులు నిర్వహిస్తున్న సచివాలయం పరిధిలోని ఏఎన్ఎం వేధింపులు తాళలేక ఈ అఘాయిత్యానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ఆస్పత్రి వర్గాలు పోలీసులకు సమాచారం అందించారు.

ఘనంగా 'తంగి' జయంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్ : సీనియర్ న్యాయవాది, మాజీ ఆంధ్ర రాష్ట్రం స్పీకర్ తంగి సత్యనారాయణ 94వ జయంతి వేడుకలు జిల్లా బార్ అసోసియేషన్‌లో డీబీఏ ప్రెసిడెంట్ కిలారి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తంగి ఘనతలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో స్టేట్‌బార్ మెంబర్ గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాది టి.రాధాకృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.కృష్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహంగా నటించి.. రూ.50వేలకు టోపీ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పురుషోత్తపురంలో వ్యక్తిని మోసగించి రూ.యాభైవేలు కాజేసిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే నందిగాం మండలం పెద్దతామరాపల్లి గ్రామానికి చెందిన బందాపు సింహాచలం పలాసలోని తన అత్తవా రి ఇంటికి రాగా.. జీడిపిక్కబొమ్మ కూడలి వద్ద ఓ వ్యక్తి స్నేహంగా పరిచయం పెంచుకుని సింహాచలం ఫోన్ నుంచి రూ.50 వేల ఫోన్ పే చేయించుకుని ఒక్కసారి ఫోన్ ఇచ్చి పరారైపోయాడు. అనంతరం ఆ ఫోన్ నంబర్‌ను సంప్రదించగా స్విచ్‌ఆఫ్ రావడంతో లబ్ధిదారుడు లబోదిబోమని స్థానిక యూనియన్, ఎస్‌బీఐ బ్రాంచ్‌లను సంప్రదించారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని అప్పుడే వివరాలు తీయగలమని చెప్పడంతో బాధితుడు కాశీబుగ్గ పోలీసులను ఆశ్రయించాడు.

మహిళ మెడలో గొలుసు చోరీ

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని ఆర్‌కే నగర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసు (చైన్) లాగేసి పారిపోయాడో దుండగుడు. రెండో పట్టణ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. ఆర్‌కే నగర్‌లో నివాసముంటున్న కె.జయలక్ష్మి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ టెక్నికల్ స్టాఫ్‌గా పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని తన నివాసానికి సోమవారం రాత్రి ఏడుగంటల సమయంలో నడుచుకుంటూ వస్తుండగా.. కరెంట్ ఆఫీసు సమీపంలో వెనుకగా మాస్క్ పెట్టుకుని నడుచుకుంటూ వచ్చిన వ్యక్తి ఒక్కసారిగా మెడలోంచి చైన్‌లాగేసి 20 మీటర్ల వెనక ఉన్న తన ద్విచక్రవాహనం వైపు పరుగుపెట్టాడు. జయలక్ష్మి దొంగ దొంగ అనే సరికి బైక్‌పై క్షణాల్లో అక్కడి నుంచి ఉడా యించేశాడు. చైన్ లాగే క్రమంలో జయలక్ష్మి రోడ్డుపై పడిపోవడంతో గాయాలయ్యాయి. వెంటనే బాధితురాలు జయలక్ష్మి 100కు డయల్ చేయడంతో ఘటన స్థలికి సీఐ వెళ్లి పరిసర ప్రాంతాల్లో సీసీ ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించగా కొన్ని ఆధారాలు లభించాయి. విషయం తెలుసుకున్న టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఘటనాస్థలికి వెళ్లి బాధితురాలు జయలక్ష్మి, ఆమె భర్త వద్ద వివరాలు ఆరా తీశారు. చోరీ జరిగిన సమయంలో కరెంట్ కూడా తీసివేశారని ఆమె డీఎస్పీ వద్ద పేర్కొన్నారు.

నెత్తురోడిన రహదారులు



భువనేశ్వర్: ఆస్పత్రిలో యువకుల మృతదేహాలు

భువనేశ్వర్: భద్రక్ జిల్లా 16వ నంబర్ జాతీయ రహదారి బొంతొ ఛక్ సమీపంలో ఆగి ఉన్న ట్రక్కును స్కూటీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు దుర్మరణం చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురు వ్యక్తులు బైక్‌పై అరొడి ఛక్ నుంచి చరంపాకు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మృతి చెందినవారిలో భద్రక్ భామల్ గ్రామానికి చెందిన శివ సుందర్(18), చొరొంపా పాథొరొఆడి గ్రామానికి చెందిన సౌరభ్ మిశ్రా(24)లు ఉన్నట్లు గుర్తించారు.

జయపురంలో...

ఒక ప్రైవేట్ బస్సు, బైక్‌లు ఢీకొన్న ఘటనలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు సంఘటన స్థలం వద్దనే మరణించారు. 26వ జాతీయ రహదారి హరడాపుట్ వద్ద ఈ ప్రమాదం జరిగినట్లు బొయిపరిగుడ ఎస్‌డీపీవో తపస్వినీ కుహార్ తెలియజేశారు. సోమవారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం జగదల్‌పూర్ నుంచి ఒక ప్రైవేట్ బస్సు కొరాపుట్ జిల్లా ధమంజొడి వస్తున్న సమయంలో ఎదురుగా బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు ఢీకొనటంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న ఇద్దరు మృతి చెందారు. మృతి చెందినవారు బొరిగుమ్మ సమితి కుంధారిగుడకు చెందిన లోకనాథ్ భోత్ర(18), రమేష్ భొత్ర(18)లుగా వెల్లడించారు.



జయపురం: ప్రమాదస్థలంలో దృశ్యం

ప్రమాద సమాచారం అందిన బొరిగుమ్మ పోలీసులు హుటాహుటిన చేరుకొని మృతదేహాలను జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ప్రమాదానికి గురైన రెండు వాహనాలను సీజ్ చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

వరద నియంత్రణకు సన్నద్ధత



సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావిత వర్షాల కారణంగా రాష్ట్రంలో సంభవించే వరదలను ఎదుర్కోవడానికి సోమవారం స్థానిక రాష్ట్ర వరద కంట్రోల్ రూమ్‌లో అభివృద్ధి కమిషనర్, జల వనరుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అనూ గర్గ్ సమీక్ష నిర్వహించారు. జల వనరుల శాఖ సీనియర్ అధికారులు, ఇంజినీర్లు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

రాష్ట్రంలో వర్షపాతం

వాయుగుండ ప్రభావంతో సోమవారం సాయంత్రం వరకు వర్షపాతం సాధారణ స్థాయికి పరిమితమైనట్లు స్థానిక వాతావరణ కేంద్రం సమాచారం. నవరంగపూర్ ప్రాంతంలో అత్యధికంగా 62 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. వాటి వివరాలను పరిశీలిస్తే..

ప్రాంతం	వర్షపాతం (మిల్లీ మీటర్లు)		
నవరంగపూర్	62.0	జాజ్‌పూర్	22.6
బౌధ్	39.0	ఢెంకనాల్	13.6
మల్కన్‌గిరి	38.4	కెంజొహార్	11.8
కొరాపుట్	37.8	బొలంగీరు	10.0
సోన్‌పూర్	30.2	బాలాసోర్	9.7
భవానీపట్న	27.6	టిట్లాగడ్	9.2
దారింగిబాడి	27.0	బరిపద	8.4
నువాపడా	23.4	అంగుల్	8.0
		నయాగడ్	7.8
		పూరీ	7.6

చపిటి అంబలో అధికారుల పర్యటన



జ్వరంతో బాధపడుతున్న వ్యక్తితో మాట్లాడుతున్న ఎంపీ బలభద్ర మఝి



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న బీజేడీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమేష్ మఝి

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి బొడ టెమరా గ్రామ పంచాయతీ చపిటి అంబ గ్రామానికి అధికార యంత్రాంగం సోమవారం తరలి వెళ్లింది. ఈ గ్రామంలో గత వారం రోజుల్లో ముగ్గురు డయేరియాతో చనిపోయారు. ప్రస్తుతం మరో ఐదుగురు రోగ పీడితులు ఉన్నారు. నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు బలభద్ర మఝి, బీజేడీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమేష్ చంద్ర మఝిలు బాధిత గ్రామంలో పర్యటించారు. వైద్యులు అందిస్తున్న సేవలు పరిశీలించారు.

దరఖాస్తు ప్రక్రియ సులభతరం



చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ల సమావేశం

భువనేశ్వర్: సుభద్ర యోజన లబ్ధిదారుల దరఖాస్తు వ్యవస్థ సరళీకరించారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. దరఖాస్తు దాఖలు ప్రక్రియను సులభతరం చేయడంపై సమావేశంలో చర్చించారు. జిల్లా కలెక్టర్లతో ముఖ్య ప్రముఖ కార్యదర్శి ఈ మేరకు చర్చించారు.

ప్రభుత్వాస్పత్రి సందర్శన



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కద్రక

రాయగడ: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక సోమవారం సందర్శించారు. వార్డులో రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోగులు వరండాల్లో చికిత్స పొందుతుండడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్‌తో చర్చించారు. జిల్లాలో అత్యధిక శాతం మంది ఆదివాసీ, హరిజనులు ఉంటున్న నేపథ్యంలో సౌకర్యాలు పెంచాలని కోరారు. రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రిలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, అసెంబ్లీలో ప్రస్తావిస్తానని వెల్లడించారు.

నివాళులు



సదాశివ త్రిపాఠి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రానికి చెందిన దివంగత మాజీ ముఖ్యమంత్రి సదాశివ త్రిపాఠి వర్ధంతి సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా మెయిన్ రోడ్డులోని సదాశివ త్రిపాఠి పార్క్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సదాశివ వంశీయులు, ఉత్కళ పరిషత్ సభ్యులు, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి తదితరులు ఉన్నారు.

పర్లాకిమిడిలో నిమజ్జనాలు



రాజవీధిలో గణపతి ఊరేగింపు

పర్లాకిమిడి: గణపతి ఉత్సవాలు కొన్ని కూడళ్లలో ముగిసిన సందర్భంగా నిమజ్జన ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. యువత ఆటపాటలతో సందడి చేస్తున్నారు. సీతాసాగరం వద్ద గణపతి విగ్రహాలని నిమజ్జనం చేస్తున్నారు.

25.5 కిలోల గంజాయి స్వాధీనం



మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

ఇచ్ఛాపురం: ప్రజలు సహకరిస్తేనే గంజాయి, నిషేధిత పదార్థాల అక్రమ రవాణా అడ్డుకోగలమని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద గల పాన్‌షాప్ వద్ద గంజాయిని అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న ఆరుగురు నిందితులను పట్టణ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ సీఐ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. గంజాయి రవాణాకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ గంజాయి ఒడిశా నుంచి అక్రమంగా తమిళనాడుకి లారీల ద్వారా రవాణా జరుగుతున్నట్లు గుర్తించామన్నారు.

గంజాయి అక్రమ రవాణాకి పాల్పడిన పట్టణానికి చెందిన బుగ్గ చిరంజీవి, తెలుకల కృష్ణసాహు, బుగ్గ సావిత్రి ఒడిశాలోని పాత్రపూర్ బ్లాక్‌కి చెందిన రబీంద్రసేతీ, సింహాచలం సేతీ, తమిళనాడు రాష్ట్రం తిరునవెల్లి జిల్లా, నెట్టూరు గ్రామానికి చెంది రమేష్ వెలయుతమ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద గల 25.560 కిలోల గంజాయితో పాటు ఒక ద్విచక్రవాహనం, 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నా రు. గంజాయి అక్రమ రవాణా అడ్డుకోవడానికి ఇచ్ఛాపురం, పాతపట్నం, పైడీభీమవరం ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టుల ద్వారా నిత్యం 24/7 తనిఖీలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సబ్‌డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, స్పెషల్‌బ్రాంచ్ సీఐ ఇమ్మాన్యుయేల్‌రాజు, సీఐ ఎం చిన్నంనాయుడు, పట్టణ ఎస్ఐ చిన్నంనాయుడు పాల్గొన్నారు.

70వ రోజుకు చేరిన కార్మికుల ఆందోళన



ఆందోళన చేపడుతున్న కార్మికులు

జయపురం: సమితి పరిధి గగణాపూర్‌లో ఉన్న సేవా పేపరు మిల్లు కార్మికులు, విశ్రాంత కార్మికులు తమ డిమాండ్ల సాధనకు మిల్లు ప్రధాన గేటువద్ద జరుపుతున్న ఆందోళనలు సోమవారం నాటికి 70 రోజులకు చేరాయి. వర్షం పడుతున్నా వారు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. 2020 నుంచి ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్, పీఎఫ్ అకౌంట్ రెగ్యులరైజ్, పీఎఫ్ అకౌంట్ స్టేట్‌మెంట్ ఉద్యోగులకు అందజేయాలని, బకాయిలు, టెర్మినల్ బెనిఫిట్స్ గ్రాట్యుటీలు చెల్లించాలని తదితర డిమాండ్లతో వారు ఆందోళన చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

భిత్తరకనికాలో పక్షుల లెక్కింపు

భువనేశ్వర్: కేంద్రాపడా జిల్లా భిత్తరకనికా అభయారణ్యం పరిసర ప్రాంతాల్లో పక్షుల గణన సోమవారం నుంచి ప్రారంభించారు. ఈనెల 13వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగనుంది. పక్షులను లెక్కించేందుకు 4 బృందాలను ఏర్పాటు చేశారు. కనికా రేంజర్ మఠ్ అడియా, లక్ష్మీ ప్రసాద్ డియా, రాజ్‌నగర్‌లోని దుర్గాప్రసాద్ డియా, బాలి డియా పక్షులను లెక్కిస్తారు.

పాముకాటుకు ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతి

- తండ్రి పరిస్థితి విషమం

భువనేశ్వర్: బౌధ్ జిల్లాలో పాముకాటుకు ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృతి చెందారు. తండ్రి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన బాఘియాపడా గ్రామ పంచాయతీ చిరియాపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. శైలేంద్ర మల్లిక్, అతని మైనర్ కుమార్తెలు తమ ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటేసింది. కుటుంబ సభ్యులు, కొందరు గ్రామస్తులు చికిత్స నిమిత్తం ఈ నలుగురిని వెంటనే గ్రామంలోని చికిత్స కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే వారి పరిస్థితి విషమించింది. దీంతో అనంతరం వారిని బౌధ్ ఆస్పత్రికి తరలించగా బాలికలు చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. శైలేంద్ర చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన గ్రామస్తులను దిగ్భ్రాంతికి గురి చేసింది.

నిమజ్జనోత్సవానికి సన్నద్ధం

- శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో నిమజ్జన పాయింట్ల గుర్తింపు



పొన్నాడ వంతెన వద్ద భద్రతా ఏర్పాట్ల గురించి చర్చిస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : సబ్ డివిజన్ పరిధిలో ఉన్న శ్రీకాకుళం (రూరల్) వన్‌టౌన్, టూటౌన్, జె.ఆర్.పురం, ఆమదాలవలస సర్కిళ్లలో గణేశుని నిమజ్జనోత్సవానికి పోలీసు బందోబస్తు సిద్ధంగా ఉందని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1055 చిన్న, పెద్ద విగ్రహాల అనుమతులు నిర్వాహకుల నుంచి వచ్చాయని, వీటిలో 295 వరకు పెద్ద విగ్రహాలున్నాయన్నారు. సోమవారం 96 విగ్రహాలు నిమజ్జనం చేయాల్సి ఉన్నా వర్షాభావ పరిస్థితుల వలన 73 విగ్రహాలు నిమజ్జనం అవుతున్నాయని అన్నారు. ఇప్పటికే 21 నిమజ్జన పాయింట్లను గుర్తించి ఆ ప్రాంతాల్లో ఆ పరిధి పోలీసులు బందోబస్తు ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఊరేగింపు, నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా గ్రామస్తులు సహకరించాలని కోరారు. వర్షాల వల్ల వాగులు, చెరువులు, నదులు పొంగి పొర్లడంతో సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల్లోపు నిమజ్జనం పూర్తయ్యేలా ఏర్పాట్లు చేసుకుంటే మంచిదని తెలిపారు. మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొనకూడదని, ఆ సమయాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు బుక్ చేస్తామని పేర్కొన్నారు.

పాయింట్లు ఇవే..

- **శ్రీకాకుళం :** డేఅండ్‌నైట్ నాగావళి కొత్త బ్రిడ్జి, పీఎన్‌కాలనీ-ఓటీఎస్ పాత బ్రిడ్జి, పొన్నాడ వంతెన, అరసవల్లి మిల్లు జంక్షన్ చెరువు, సింగుపురం చెరువు, పెద్దపాడు రామిగెడ్డ (వంశధార కెనాల్)
- **గార :** తండ్యాల్‌పేట బీచ్ రెండు పాయింట్లు, బందరువానిపేట బీచ్, గాబువానిపేట ట్యాంకు
- **జె.ఆర్.పురం:** లావేరు, పొన్నాడ బ్రిడ్జి, కృష్ణాపురం ట్యాంకు
- **ఆమదాలవలస:** చీమలవలస గెడ్డ, మండడ చెరువు, జివాంబిపేట చెరువు, కొరకాం గెడ్డ, మంగళి చెరువు, కృష్ణాపురం చెరువు, తొగరాం (నాగావళి నది)
- ధర్మవరం, ధల్లావలస, పెనుబర్తి
- **సరుబుజ్జిలి :** పాలవలస, బొర్రంపేట

నియమాలు పాటించాల్సిందే: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : నాగావళి ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో భారీ విగ్రహాలను నిమజ్జనం చేసే సమయాల్లో భక్తులు నియమాలు పాటించాలని, అధికారులు ఆ ప్రదేశాల్లో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ కార్యాలయం మార్గంలో ఉన్న పొన్నాడ వంతెన ఇరువైపులా వినాయకుని నిమజ్జన ప్రదేశాలను డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ పైడపునాయుడులతో కలిసి సందర్శించారు. ఎస్పీ మాట్లాడుతూ పొన్నాడ వంతెన, డేఅండ్‌నైట్ కొత్త బ్రిడ్జి, ఏడురోడ్ల కూడలి-గుజరాతీపేట పాత వంతెన వద్ద నిమజ్జన ప్రదేశాల్లో ఇతర విభాగాల సమన్వయంతో లైటింగ్స్, క్రేన్లు, లైవ్‌బోట్స్, అంబులెన్సు, బారికేడ్లు, గజ ఈతగాళ్లు, ఫైర్ విభాగం, అవసరమయ్యే సిబ్బందిని ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. వాగులు, కాలువలు, నదుల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో భక్తులెవరూ విగ్రహాలను స్వతహాగా నిమజ్జనం చేయరాదని, క్రేన్లు, గజ ఈతగాళ్ల సాయంతో చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో చిన్నపిల్లలను, మద్యం సేవించిన వారిని నిమజ్జన ప్రదేశాలకు తీసుకురాకూడదని, అనుమతులు లేని చోట నిమజ్జనం చేయరాదని, ప్రశాంతంగా దైవ కార్యక్రమం ముగించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఎస్పీ వెంట డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐలు పైడపునాయుడు, ఇమ్మాన్యుయెల్ రాజు ఉన్నారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తి అరెస్ట్

భువనేశ్వర్: పొరుగింటి వారిని చంపుతానని బెదిరించిన వ్యక్తిని భువనేశ్వర్ అర్బన్ పోలీస్ జిల్లా (యూపీడీ) పరిధిలోని లక్ష్మీసాగర్ ఠాణా పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పిస్తోలుతో కాల్చి చంపుతానని పొరుగింటి మహిళకు ప్రాణభయం కలిగించిన స్థానిక ఝురపడా ప్రాంతానికి చెందిన రమేష్ బెహెరా అలియాస్ బాబాజీని అరెస్టు చేశారు. నిందితుని దగ్గర నుంచి అమెరికాలో తయారైన పిస్టల్, ఐదు రౌండ్ల పేలని తూటాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం



డ్రైవింగ్ శిక్షణ పుస్తకాన్ని శిక్షణ అభ్యర్థికి అందజేస్తున్న ఆర్టీసీ మేనేజర్

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఇచ్చే హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణను అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ నందు 17వ బ్యాచ్‌కు ఇచ్చే శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అతను మాట్లాడుతూ డ్రైవింగ్ అనునది చాలా కష్టతరమైనదన్నారు. మన శరీరంలో చాలా అవయవాలు సమన్వయం చేసుకొని డ్రైవింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి డ్రైవింగ్ చేయాలన్నారు. నెలరోజుల పాటు క్రమశిక్షణతో నేర్చుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1,2 డిపో మేనేజర్‌లు పి.మల్లికార్జునరాజు, కేఎస్‌ఆర్ శర్మ, శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్‌లు వి.రమేష్, ఎ.గంగరాజు, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. నెల రోజులు తర్వాత 18వ బ్యాచ్‌ను ప్రారంభిస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు 7382923293, 7095040608, 73829 17289 నంబర్లను సంప్రదించాలని వారు తెలిపారు.

యువతిపై సామూహిక అత్యాచారం

- నలుగురు నిందితులు అరెస్ట్

భువనేశ్వర్: యువతి పట్ల సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో మొహులొపుంజి గ్రామానికి చెందిన బాబులీ నాయక్, బిరంచి మహరణ, అబినాష్ పరిడా, జీవన్ పరిడాలు ఉన్నారు. వీరంతా 22 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణ. ఢెంకనాల్ సదర్ ఠాణా పోలీసులు ఈ ఘటనపై విచారణ ప్రారంభించారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని ఓ ఏటీఎం చోరీకి దుండగుడు ఆదివారం అర్ధరాత్రి విఫలయత్నం చేశాడు. కళింగ రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ చేస్తుండగా.. ఎస్‌బీఐ పర్యవేక్షకులకు అలారం మోగింది. దీంతో వారు పోలీసులను అప్రమత్తం చేశారు. పోలీసులు వెంటనే స్పాట్‌కు వెళ్లారు. అయితే పోలీసు జీపు సైరన్ విన్న ఆ వ్యక్తి సందులోంచి పారిపోయాడు. అక్కడికి వెళ్లి చూసేసరికి ఏటీఎం బాక్స్ దగ్గర ఉండే ఆన్‌లైన్ కనెక్షన్ వైర్లు తెగి ఉన్నాయి. చొరబడిన వ్యక్తి టెక్నీషియన్ అయి ఉంటాడని, వైర్లు కట్ చేసి బాక్సును తెరిచి అందులో ఉన్న నగదును చోరీ చేసేందుకు ప్రయత్నించి ఉంటాడని భావిస్తున్నారు. ఏటీఎం వద్ద సీసీ ఫుటేజీని పరిశీలించగా బాక్స్ పైనుంచి వ్యక్తి వైర్లను కట్ చేస్తున్న దృశ్యం కనిపించింది. బయట కూడా సందులో పారిపోతున్నట్లుగా సీసీ ఫుటేజీలో నిక్షిప్తమై వుంది. అదే సమయంలో టూటౌన్ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు నైట్‌రౌండ్లో ఉండటంతో హెచ్‌సీ రవి చోరీ యత్నానికి సంబంధించి వివరాలు చెప్పారు.

క్లుప్తంగా

కారుణ్య నియామక పత్రాల అందజేత



నిర్మలకు కారుణ్య నియామకపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: అయినాడ మండల పరిషత్ పాఠశాలలో గ్రేడ్2 ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ, అకాలమరణం పొందిన ఎం.నాగేశ్వర రావు భార్య నిర్మలకు కారుణ్యనియామక పత్రాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు సోమవారం తన చాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం పీఆర్ఐ సబ్‌డివిజన్ కార్యాలయంలో సహాయకురాలిగా నియమిస్తూ ఆమెకు ఈ నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయం సీసీ సురేష్ తదితరులు ఉన్నారు.

అలరించిన గాత్ర కచేరీ



గాత్రకచేరీ నిర్వహిస్తున్న సంగీత, నృత్యకళాశాల విద్యార్థులు

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కళాశాల విద్యార్థులు నిర్వహించిన గాత్రకచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. గాత్ర కచేరీలో విద్యార్థులు దేవి, నీలిమ, మనీష దివ్య, తులసి, పవన్‌రాజు, మోహన్ కుమార్, సురేష్ కుమార్, సాయిగాయత్రి, జస్మిత, లాస్యవీణ, ప్రవల్లికలు అద్భుతంగా గానాలాపన చేశారు. వెంకటరావు మృదంగంపై సహకరించగా, సహాయ అధ్యాపకురాలు దేవీసుజాత నిర్వహణ బాధ్యత చేపట్టారు. అనంతరం నిర్వహించిన వయోలిన్ కచేరీలో ఆముదాలవలసకు చెందిన సత్యనారాయణ శర్మ, శాక్సాఫోన్‌పై మన్మథరావు, మృదంగంపై సూర్యప్రసాదరావులు సహకరించారు.

నలుగురు గంజాయి నిందితుల అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొండపల్లి: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంజాయి అక్రమ రవాణాకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. విజయనగరంలోని చెల్లూరుకు చెందిన కె.ఫణీంద్ర పట్నాయక్‌తో పాటు అల్లు సాగర్, టి.తేజ స్వరూప్, ఒడిశాలోని మునిగుడకు చెందిన సరోజ్ పటేల్‌లు అనుమానాస్పదంగా గొట్లాం రైల్వేస్టేషన్ వద్ద సంచరిస్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎస్సై యు.మహేష్ సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. అనంతరం వారిని తనిఖీ చేసి వారి దగ్గరున్న రెండున్నర కేజీల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లు, ఆరు వేల నగదు, సరోజ్ పటేల్ వద్ద కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో గజపతినగరం సీఐ ఏవీ రమణ, ఎస్సై యు.మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ కమిటీ ఔదార్యం

- ఇల్లు కోల్పోయిన బాధితునికి రూ.లక్ష ఆర్థిక సాయం
- యువతను అభినందించిన పెద్దలు



శ్రీను కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేసిన యువగణేష్‌సేవా సంఘం సభ్యులు

మెరకముడిదాం: ఇల్లు కోల్పోయిన బాధితుడికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం చేసి గొప్పమనసును చాటుకున్నారు గర్భాం గ్రామానికి చెందిన యువగణేష్‌సేవా సంఘం సభ్యులు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గర్భాం గ్రామానికి చెందిన తాల్లాభక్తుల శ్రీనుకు చెందిన మిద్దిల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. శ్రీను కుటుంబ సభ్యులు నిరాశ్రయులుగా మిగిలారు. వీరి దీనస్థితిని చూసి సంఘ సభ్యులు చలించిపోయారు. గణపతి ఉత్సవాల్లో భాగంగా పౌరాణిక నాటికను ప్రదర్శించేందుకు పోగుచేసిన రూ.లక్షను ఇల్లు నిర్మించుకునేందుకు సాయంగా శ్రీనుకు సోమవారం అందజేశారు. వారికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలపగా, గ్రామపెద్దలు అభినందించారు.

- లైసెన్స్ లేకుండా షాపుల్లో మందుల విక్రయం
- కేసులు నమోదు చేసిన ఔషధ నియంత్రణ శాఖ
- జిల్లాలో 1200 మందుల షాపులు
- ఏడాదిలో1012 మందుల దుకాణాల తనిఖీ
- నిబంధనలు అతిక్రమించిన 237 మందికి నోటీసులు
- కోర్టులో ఐదు కేసులు



మందుల షాపు

మందులోడా.. ఓరి మాయలోడా..!

విజయనగరం ఫోర్ట్: జిల్లాకేంద్రంలోని కొత్త అగ్రహారంలో గౌరీశంకర్ అనే వ్యక్తి లైసెన్స్ లేకుండా సర్జికల్ మెటీరియల్ విక్రయిస్తున్నట్లు ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు సమాచారం రావడంతో ఆకస్మికంగా తనిఖీ చేసి పట్టుకున్నారు. అతని వద్ద రూ.3 లక్షల విలువల చేసే సర్జికల్ మెటీరియల్‌ను సీజ్ చేశారు. అనంతరం కోర్టులో కేసు ఫైల్ చేశారు.

☛ తెర్లాం మండలంలోని నెమలాం గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు సమాచారం అందగా తక్షణమే స్పందించి తనిఖీ చేసి పట్టుకుని రూ.30 వేలు విలువ చేసే మందులు సీజ్‌చేసి కోర్టులో కేసు నమోదు చేశారు.

ఇలా ఐదుగురిపై కోర్టులో కేసులు నమోదయ్యాయి. లైసెన్స్ తీసుకుంటే పన్నుచెల్లించాల్సి వస్తుందని తెలిసిన షాపుల నిర్వాహకులు కొంతమంది, దాన్ని ఎగ్గొట్టేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. లైసెన్స్ లేకుండానే మందులు విక్రయించేస్తున్న క్రమంలో పాపం పండి దొరికి పోతున్నారు.

లైసెన్స్ లేకుండా మందుల విక్రయంతో రోగులకు నష్టం

లైసెన్స్ లేని వ్యక్తుల దగ్గర మందులు, సర్జికల్ మెటీరియల్స్ కొనుగోలు చేయడం వల్ల రోగులు నష్టపోవాల్సిన పరిస్థితి. నాణ్యతలేని, కాలపరిమితి దాటిన మందులను వారు విక్రయించే ఆస్కారం ఉంది. వాటిని రోగులు వినియోగించడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే ప్రమాదముంది. లైసెన్స్ లేకుండా మందులు విక్రయించడం వల్ల ఎటువంటి బిల్లు ఇవ్వరు. దీనివల్ల మందుల షాపు నిర్వాహకులపై కోర్టులో గానీ మరెక్కడైనా కానీ పోరాటం చేయడానికి అవకాశం ఉండదు.



సర్జికల్ మెటీరియల్

మందుల దుకాణాలకు నోటీసులు

జిల్లాలో ఉన్న మందుల దుకాణాలను ఔషధ నియంత్రణ శాఖ అధికారులు తనిఖీ చేస్తున్నారు. నిబంధనలు పాటించని షాపులకు నోటీసులు జారీ చేస్తున్నారు. జిల్లాలో 1200 మందుల దుకాణాలు ఉండగా 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జిల్లాలో 1012 దుకాణాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన 237 మందుల దుకాణాలకు నోటీసులు జారీ చేశారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు

నిబంధనలకు విరుద్ధంగా మందుల దుకాణాలు నిర్వహించే వారిపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాలపరిమితి దాటిన మందులు విక్రయించడం, లైసెన్స్ లేకుండా మందుల షాపు, రికార్డులు నిర్వహించకపోవడం, నాణ్యత లేని మందులు విక్రయించడం వంటి వాటిపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

లైసెన్స్ లేకపోతే నేరం

లైసెన్స్ లేకుండా మందులు విక్రయించడం నేరం. ఇలా విక్రయిస్తున్న వారిలో ముగ్గురికి ఇదివరకే జైలు శిక్ష కూడా పడింది. మందులు, సర్జికల్ మెటీరియల్ లైసెన్స్ లేకుండా విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. కోర్టులో కేసులు పెడతాం. లైసెన్స్ కలిగిన మందుల దుకాణాలపై కూడా తనిఖీ నిర్వహిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోనున్నాం.

– కె. రజిత, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ

ఇసుక సరఫరాలో ఇబ్బంది కల్పించవద్దు

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: ఉచిత ఇసుక సరఫరాలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా లారీ యాజమానులు చూడాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. ఈ మేరకు లారీ యాజమానులకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహకరించనుందని చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లారీ యాజమానులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా వాహనాలను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇసుక కోసం కూడా వినియోగదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జిల్లాలో ఇంతవరకు 87 వాహనాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయని తెలిపారు. ప్రస్తుతం బొబ్బిలి వద్ద 37 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, అక్టోబర్‌లో మరో రెండు స్టాక్ ప్లాయింట్లలో 1.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి రాబోతున్నట్లు తెలిపారు. లారీలు ఇసుక కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోగానే ట్యాగ్ చేసిన వాహనదారుని మొబైల్ నంబర్‌కు టైమ్, స్లాట్ కేటాయిస్తారన్నారు. అదేవిధంగా తెలుగులో ఎప్పటికప్పుడు మెసేజ్ అలర్ట్స్ కూడా వస్తాయని చెప్పారు. లారీ కెపాసిటీని బట్టి ధర నిర్ణయించనున్నామని, కొత్త విధానాలు అమలు చేసేటప్పుడు ఇబ్బందులు ఉంటాయని, లారీ యాజమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో మైన్స్ డీడీ పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

86శాతం అధిక వర్షపాతం



కంట్రోల్ రూమ్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 86శాతం అధికంగా వర్షపాతం నమోదైందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు, మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయని అధికారులు సమన్వయంతో పనిచేసి ఎక్కడా ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం కలగకుండా అప్రమత్తంగా వ్యవహరించారని ప్రశంసించారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు గ్రామ, మండల స్థాయి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతుకు ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు వేసి పంపించాలని ఆదేశించారు. తాగునీరు, కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని కోరారు. వర్షాలకు ఇళ్లు దెబ్బతిని పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి వారి ఇళ్లలో ఉన్న వస్తువులకు నష్టపరిహారం అందించాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో గ్రామస్తులను భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, డీఆర్‌డీఏ పీడీ వై. సత్యం నాయుడు, డ్వామా పీడీ కె. రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'కంట్రోల్ రూమ్ పరిశీలన

తుఫాన్ దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేసేందుకు, ప్రజల నుంచి సమస్యలను తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్ రికార్డును పరిశీలించారు.

గంజాయి నియంత్రణకు కఠిన చర్యలు

- ఎస్పీ వకుల్‌జిందాల్

గంట్యాడ: జిల్లాలో గంజాయి రవాణా, విక్రయం, వినియోగం నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన గంట్యాడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ ప్రాంగణాన్ని, పోలీసు బిల్డింగ్ గదులు, ప్రాపర్టీ రూం, లాకప్ గదులను పరిశీంచారు. పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో సీజ్ చేసి ఉన్న వాహనాలను పరిశీలించి ఆయా వాహనాలు ఏ కేసుకు సంబంధించినవో తెలిసే విధంగా లేబుల్స్‌ను ఏర్పాటు చేయాలని, రికార్డు మెయింటెయిన్ చేయాలని అధికారులను ఆదేశించారు. సీడీ ఫైల్స్, స్టేషన్ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్‌లో క్రైమ్ చార్ట్ పరిశీలించి, పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారి ప్రమాదాలు ఎక్కడ ఎక్కువ జరుగుతున్నది, బ్లాక్ స్పాట్స్ ఎక్కడ ఉన్నది ఎస్సై సాయి కృష్ణను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు గంట్యాడ పోలీసులు చేపడుతున్న చర్యలపై ప్రశ్నించారు. రాత్రి గస్తీ సమయాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తుల వేలిముద్రలను మొబైల్ ఫింగర్ ప్రింట్ చెక్ డివైజ్‌తో తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ కేకేవీ విజయనాథ్, ఎస్సై సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గంట్యాడ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

'కాంట్రాక్ట్' నర్సులను రెగ్యులర్ చేయాలి



ధర్నా చేస్తున్న నర్సులు

- సంఘం నాయకురాలు ప్రశాంతి

విజయనగరం ఫోర్ట్: కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే నర్సులందరినీ రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నర్సుల సంఘం నాయకురాలు ప్రశాంతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబర్ 115ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైద్యారోగ్యశాఖ పరిధిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్‌హెచ్‌ఎం విభాగాల్లో 13 నుంచి 15 ఏళ్లుగా పనిచేస్తున్నారని, వారందరినీ రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు వారికి రెండేళ్లు శిక్షణ ఇచ్చి రెగ్యులర్ చేస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రాణాలను పణంగా పెట్టి కోవిడ్ సమయంలో నర్సులు సేవలు అందించారని గుర్తు చేశారు. తమ సమస్యలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ లను కలిసి వినతి పత్రం ఇచ్చినప్పటికీ ఎటువంటి స్పందన లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం ,ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గతంలో మంజూరైన పనులు చేస్తారా?



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

- మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సాలూరు నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి పనులు పూర్తిచేస్తారా? లేక అడ్డుకుంటారా అన్ని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ. 1200 కోట్లతో బ్రిడ్జిలు, రోడ్లు తమ ప్రభుత్వం హయాంలో పూర్తిచేశామన్నారు. అయితే ఇంకా పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి శంకుస్థాపనలు కూడా పూర్తి చేశామన్నారు. ఆ పనులన్నీ పూర్తిచేయాల్సిన బాధ్యత ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ఉందని, తొందరగా పనులు చేస్తే రెండేళ్లలో పూర్తి కావస్తాయన్నారు. మంజూరు చేసిన పనులు పూర్తిచేయగలిగితే నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎప్పుడూ అండగా ఉంటానని, అవసరమైతే తన సహాయసహకారాలు ఎప్పుడూ ఉంటాయని చెప్పారు. సమావేశంలో ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు గొట్టాపు ముత్యాల నాయుడు, పి.వీర నాయుడు, పెద్దిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 150 సంవత్సరాల వేడుక

విజయనగరం టౌన్: స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ పక్కన ఉన్న సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 150వ వసంతంలోకి అడుగుపెట్టబోతున్న సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంఘమిత్ర ఆర్ ఎస్.జాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు రెవరెండ్ డాక్టర్ వై.ప్రభాకర్ దైవ సందేశాన్ని అందిస్తారని, కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. కేక్ కటింగ్‌ను కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చేస్తారని తెలిపారు. క్రైస్తవ సోదరులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కొట్టుకుపోయిన కాజ్‌వే

బొబ్బిలి రూరల్: రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పారాది గ్రామం వద్ద నిర్మించిన తాత్కాలిక కాజ్‌వే వరదనీటిలో కొట్టుకుపోయింది. శనివారం నుంచి ఎగువ ప్రాంతాలైన పాచిపెంట, సాలూరు, ఒడిశాలో పెద్ద ఎత్తున వర్షాలు కురవడంతో ఆ వరద నీరంతా వేగావతిలో చేరి ప్రవహించడంతో ఒక్కసారిగా వచ్చిన భారీ వరదకు తాత్కాలిక బ్రిడ్జి కొట్టుకుపోయింది. మొన్నటి వరకు కొంత మేర దెబ్బతిన్నా కాస్త మరమ్మతులు చేసి వాహనాల రాకపోకలు సాగించేవారు. ప్రస్తుత వర్షాలకు ఆ కాజ్‌వే పూర్తిగా కొట్టుకు పోవడంతో కొత్తగా కాజ్‌వే నిర్మించాల్సి ఉంది. వర్షాలు పూర్తిస్థాయిలో తగ్గితే కొత్త బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, అంతవరకు పాతబ్రిడ్జిపైనే 10 టన్నుల బరువున్న వాహనాలను అనమతిస్తామని తహసీల్దార్ ఎం.శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన కాజ్‌వే కొట్టుకుపోయిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అలాగే ఈ వర్షాల ప్రభావంతో మండలంలోని గోపాలరాయుడు పేట, నారశింహుని పేట, సీతయ్యపేట గ్రామాల్లో నానిపోయిన ఇంటిగోడలు కూలిపోయిన సమయంలో ఆ ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. బాధితులకు స్థానిక సచివాలయాల్లో తాత్కాలిక బస ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.



కొట్టుకుపోయిన పారాది కాజ్‌వే

తోణాంలో జ్వరాల తీవ్రత

సాలూరు రూరల్: మండలంలోని తోణాం గ్రామంలో జ్వర పీడితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. కొద్దిరోజులుగా జ్వరాలతో పలువురు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో చేరి వైద్య సేవలు పొందుతున్నప్పటికీ రెండు రోజులుగా బాధితులు పెరిగిపోతుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం దాదాపు గ్రామంలోని ప్రతి ఇంటిలోనూ జ్వరపీడితులు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



జ్వరంతో బాధపడుతున్న గంగారావు



జ్వరం బారిన పడిన ఉష

రక్త హీనతతో యువకుడి మృతి



సూరజ్ (ఫైల్)

భామిని: మండలంలోని పెద్దదిమిలి గ్రామానికి చెందిన యువకుడు పాలక సూరజ్(25) తలసేమియాతో బాధపడుతుండడంతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతూ సోమవారం మృత్యువాత పడ్డాడు. సూరజ్ తలసేమియాతో బాధపడుతూ రెండు నెలలకు ఒకసారి రక్తమార్పిడి చేసుకుంటున్నాడు. ప్రభుత్వం నుంచి నెలవారీ రూ.10 వేల పింఛన్ కూడా అందుకుంటున్నాడని మృతుడి కుటుంబసభ్యులు విలపిస్తూ తెలిపారు. సూరజ్‌లో పచ్చకామెర్ల లక్షణాలు బయట పడడంతో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయిస్తుండగా ప్రాణాలు పోయాయని వాపోయారు. మృతుడి తండ్రి రామారావు ఎనిమిది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. భర్త, కొడుకుల మృతిలో ఆ ఇంటి ఇల్లాలు రూపవతి అనాథగా మారిందని స్థానికులు తెలిపారు.

గిరిజనుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



పెదఖేర్జీల గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ జగన్మోహనరావు

- డిప్యూటీ డీఎంహెచ్ఓ టి.జగన్మోహనరావు

కొమరాడ: మారుమూల గిరిజన గ్రామాల ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని సర్వపాడు, చినఖేర్జీల, కె.కొత్తవలస, పెదఖేర్జీల గ్రామాలను సోమవారం ఆయన సందర్శించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధుల ప్రభావం, ప్రజల ఆరోగ్యం వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను తనిఖీ చేశారు. ఏ వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నాయి, వారికి అందించిన చికిత్స, తదితర వివరాలను పరిశీలించారు. గర్భిణుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. వెల్‌నెస్ కేంద్రం వద్ద ఉన్న ఫీడర్ అంబులెన్స్‌ను పరిశీలించి ఈ వారంలో అందించిన సేవలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను వివరించారు. పెదఖేర్జీలలోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి ధనుంజయ తదితరులున్నారు.

నిమ్మలపాడులో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, బట్లభద్ర, నిమ్మలపాడు పంట పొలాల్లో ఏనుగులు సోమవారం ఉదయం దర్శనమిచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పామాయిల్ తోటలో ఉండి గుమ్మడిగెడ్డ వాగులోకి జారుకున్నాయి. సాయంత్రం నిమ్మలపాడు నుంచి కొమరాడ మండలంలోని పాత దుగ్గి పరిసర ప్రాంతాలలోకి చొచ్చుకు వచ్చాయి. చీకటి పడిన సమయంలో మళ్లీ గ్రామంలోకి వస్తాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అటవీ సిబ్బంది వాటిని తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

కనకమహాలక్ష్మి హుండీల ఆదాయం రూ.4,70,486

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం హుండీల నుంచి రూ. 4,70,486ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ ఏడాది మే 27 నుంచి సెప్టెంబర్ 9 వరకు భక్తులు సమర్పించిన కానుకలను దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పీవీ లక్ష్మి నేతృత్వంలో సోమవారం లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్, వీఆర్వో సలీమ, తదితరులు పాల్గొన్నారు.

'మల్లి' పాఠశాలను సందర్శించిన పీఓ

సీతంపేట: మండలంలోని 'మల్లి' గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి(ఎఫ్ఏసీ) సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అక్కడ చదువుతున్న భామిని ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థులను నూతన భవనాలు పూర్తయిన వెంటనే తరలిస్తామన్నారు. అప్పటి వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రిన్సిపాల్ వాసుదేవరావుకు సూచించారు.